క్లుప్తంగా

బీసీ హక్కుల సాధనకు పోరాడాలి



కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్‌: బీసీ హక్కుల సాధన కోసం యువత ముందుకు రావాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముద్దాడ మధు పిలుపునిచ్చారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనాభాలో సగభాగం ఉన్న బీసీలు ఐక్యంగా ముందుకు వెళ్లాలని, మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు యువత కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా నగరపాలక యువజన అధ్యక్షుడిగా ఎస్‌.గోపాలకృష్ణ యాదవ్‌, ప్రధాన కార్యదర్శిగా ఎల్‌.సత్యనారాయణను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టి.కృష్ణ, వి.రవి, ఎస్‌.సతీష్‌, శ్రీను, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో కుళాయి



రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్‌

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి నాయుడు కాలనీలో రోడ్డు మధ్యలో కుళాయిని ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు కాలనీవాసులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యవంతమైన జీవితం



ప్రొఫెసర్‌ సత్యనారాయణను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్‌ శశిభూషణరావు

విజయనగరం అర్బన్‌: సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని అనిట్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాల అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఎస్‌.సత్యనారాయణ అన్నారు. సీతం ఇంజినీరింగ్‌ కళాశాలలో 'ఫిట్‌నెస్‌, న్యూట్రిషన్‌, సంతుల జీవితం' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలాలను బలోపేతం చేసుకుంటే బలహీనతలు బలహీనపడతాయని అన్నారు. అలాగే విద్యార్థుల శక్తి స్థాయిలను మెరుగుపరిచే వివిధ కారణాలను, ఒత్తిడి సడలించే పద్ధతులను వివరించారు. అనంతరం ఆయన్ను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ డీవీరామమూర్తి, ప్రథమ సంవత్సరం విభాగాధిపతి డాక్టర్‌ కె.శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్స్‌ డే వేడుకలకు సర్వం సిద్ధం



పెన్షనర్స్‌ డే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్‌ ప్రతినిధులు

విజయనగరం క్రైమ్‌: రైల్వే పెన్షనర్స్‌ డే వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు రైల్వే పెన్షనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథం, ఆర్‌.ఎస్‌.కుప్పూరావు తెలిపారు. అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 27న బుధవారం పెన్షనర్స్‌ డే వేడుకలను అసోసియేషన్‌ కార్యాలయంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి రైల్వే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, బ్యాంక్‌ అధికారులను ఆహ్వానించినట్లు తెలిపారు. వారి ఆధ్వర్యంలో వయోవృద్ధులు, పెన్షనర్లకు సత్కార కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా రైల్వే పెన్షనర్స్‌ ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అసోసియేషన్‌ సభ్యులు, పెన్షనర్స్‌ హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి సిహెచ్‌.జగన్నాథరాజు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వి.ప్రసాదరావు, వైస్‌ ప్రెసిడెంట్స్‌ టి.వెంకటరావు, సిహెచ్‌.అప్పన్న, కేవీ.రావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్‌

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్‌ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు ఆధ్వర్యంలో పట్టణంలోని 10వ వార్డుల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వార్డులోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్లు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్‌ వ్యవస్థ ద్వారా అర్హుల ఇంటి ముంగిటకే పథకాలను చేరవేస్తోందన్నారు.

ఆరోగ్యశ్రీతో కార్పొరేట్‌ వైద్యం

ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్‌ వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పథకంతో నిరుపేద ప్రజలకు కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో పేదలకు మరింత లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే బడ్డకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీకి కొత్తగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభించారని, ఈ పథకానికి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగులు దిద్దారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, చైర్‌పర్సన్‌ బంగారు సరోజిని, వైస్‌ చైర్మన్‌ ఎస్‌.రామారావు, జిల్లా కార్యదర్శి గంటా సత్యనారాయణ, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్‌, మొయిద శ్రీనివాసరావు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మద్దిల వాసు, రేగాన శ్రీనివాసరావు, నొపాడ శ్రీనివాసరావు, మున్సిపల్‌ ఇన్‌చార్జ్‌ కమిషనర్‌ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి

- శాసనసభ డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి
- 19వ డివిజన్‌లో రూ.84 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం ప్రారంభం

విజయనగరం: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 19వ డివిజన్‌ పరిధి లంకపట్నంలో రూ.84 లక్షలతో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని మంగళవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోలగట్ల మాట్లాడుతూ.. లంకాపట్నం, జొన్నగుడ్డి ప్రాంతాలతో తనకెంతో అనుబంధం ఉందని, ఆయా ప్రాంతాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నానని అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కళ్యాణ మండపానికి అంబేడ్కర్‌ సామాజిక భవనంగా నామకరణం చేసేందుకు కౌన్సిల్‌ ఆమోదం కోరనున్నట్లు చెప్పారు. రాతువీధిలో మరుగుదొడ్ల నిర్మాణానికి చొరవ చూపామన్నారు. రానున్న రోజుల్లో లంకాపట్నంలో సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రెల్లి కార్పొరేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదనరావు మాట్లాడుతూ చట్టసభలలో తమ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్‌ కోలగట్లను ఘనంగా సత్కరించారు. అంతకుముందు కార్పొరేటర్‌ పొట్నూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోలగట్లకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేషన్‌ కమిషనర్‌ ఆర్‌.శ్రీరాములనాయుడు, ఇన్‌ఛార్జి ఈఈ దక్షిణామూర్తి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్‌ బంగారునాయుడు, కార్పొరేటర్‌ పట్నాన పైడిరాజు, పొట్నూరు వెంకటరాజు, పద్మ, బొంగ భానుమూర్తి, ఆర్జి శివప్రసాద్‌, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం రూరల్‌: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. డాక్టర్‌ వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య ఖర్చు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో మరింత మెరుగైన వైద్యం అందుతుందన్నారు. మండలంలోని రాకోడు గ్రామంలో నూతనంగా మంజూరైన 811 ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. అవ్వాతాతలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించడం, కళ్లద్దాలు అందించడం వంటివి చేస్తున్నారని, వైద్యులను ఇంటి వద్దకే పంపించి వైద్య సేవలందిస్తున్నారని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో జొన్నవలస పీఏసీఎస్‌ అధ్యక్షులు కెల్ల త్రినాథ్‌, రాకోడు గ్రామ సర్పంచ్‌ పాటిపిరెడ్డి వెంకటరమణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణి, వైద్య, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న గ్రామీణ వైద్యులు

విజయనగరం ఫోర్ట్‌: గ్రామీణ వైద్యులకు తగిన గుర్తింపు ఇవ్వాలని గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి కోరారు. పట్టణంలోని డీ-మార్ట్‌ ఎదురుగా ఉన్న ల్యాంశం సర్వారాయ విహార్‌లో మంగళవారం ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. నిలిచిపోయిన కమ్యూనిటీ పారామెడికల్‌ ట్రైనింగ్‌ను పునరుద్ధరించాలని కోరారు. గ్రామీణ వైద్యులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ఆటపాటలతో సందడిగా గడిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు, కోశాధికారి ఉమాశంకర్‌, సహాయ కార్యదర్శి ఎం.తిరుపతిరావు, రాజాం డివిజన్‌ అధ్యక్షుడు చౌదరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి



ఆవాల గిరీష్‌ కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. మండలంలోని పెదతాడివాడ పంచాయతీ బేతనాపల్లి గ్రామానికి చెందిన ఆవాల గిరీష్‌ అరుదైన వ్యాధితో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం కు రూ.1.70 లక్షలు మంజూరైంది. బంగార్రాజుపేటకు చెందిన వానం రాంబాబు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తలకు శస్త్రచికిత్స చేయించుకోవడంతో వైద్య ఖర్చుల కోసం రూ.3.50లు మంజూరైంది. అలాగే పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన ఎస్‌.రామకృష్ణకు రూ.80 వేలు మంజూరైంది. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుమజ్జి త్రినాథరావు, సాడి ఈశ్వరరావు, ఎంపీటీసీ పొంతపల్లి జగన్నాథరావు, జేసీఎస్‌ కన్వీనర్‌ సారిక గౌరి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్‌: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడ ఆర్‌బీకే వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, రాయితీపై విత్తనాలు, ఎరువులు, యంత్రపరికరాలు అందించడంతో పాటు పంటకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలబడుతోందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ గిరిబాబు, పీఏసీఎస్‌ చైర్మన్‌ కోట్ల పైడినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు జగన్నాథం, నాయకులు అక్కోజీ, రామారావు, ఏఓ పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

పైడితల్లికి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్‌: పైడితల్లి అమ్మవారి వనంగుడి ఆవరణలో చండీయాగాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయవేదపండితులు దూసి శివప్రసాద్‌ శర్మ, శంబరి కృష్ణలు అమ్మవారి యాగ ప్రక్రియను పూర్తిచేశారు. అనంతరం అమ్మవారి యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.88 లక్షలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న డిప్యూటీ మేయర్‌ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి క్షేత్రస్థాయి పర్యటనల్లో గుర్తించిన ప్రతీ సమస్యకు పరిష్కారం చూపించే దిశగా కార్పొరేషన్‌ కౌన్సిల్‌ కృషి చేస్తోందని నగర డిప్యూటీ మేయర్‌ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 38, 39 డివిజన్లలో రూ.88 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. 38వ డివిజన్‌లో రూ.67.50 లక్షలతో, 39వ డివిజన్‌లో రూ.19.50 లక్షలతో రహదారులు, కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్‌ ఇన్‌ఛార్జి డాక్టర్‌ వి.ఎస్‌.ప్రసాద్‌, కార్పొరేటర్లు తొగురోతు సంధ్యారాణి, వింత ప్రభాకర్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం



వికసిత్‌ భారత్‌ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. పూసపాటిరేగ-1 సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన 'వికసిత్‌ భారత సంకల్పయాత్ర'లో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా గ్రామాలను ప్రగతిబాటలో నిలపాలన్నారు. అనంతరం సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయల స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీలు అల్లాడ రమేష్‌, ఎస్‌.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, టొంపల సీతారాం, బూర్లె శ్రీధర్‌, ఎంపీడీఓ రాధిక, వ్యవసాయ అధికారి కె.నీలిమ, వైద్యాధికారి రాజేష్‌వర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి మరింత భరోసా

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మోపాడ పీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌ కార్డులను చూపుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు పెద్ద రోగం వస్తే మరణమే శరణ్యమైన రోజుల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి ఎంతోమందికి ప్రాణదానం చేశారన్నారు. ఇప్పుడు ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్‌ వైఎస్సార్‌ఆరోగ్యశ్రీ కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య సంక్షేమం కోసం అండగా నిలిచారన్నారు. అలాగే గ్రామాల్లో వెల్‌నెస్‌ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకు ప్రభుత్వ వైద్యసేవలు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌ అప్పలరాజు, డాక్టర్లు యోగితాబాల, శరణ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



11వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్‌ విజయలక్ష్మి

విజయనగరం: విజయనగరం మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించటమే ధ్యేయంగా పని చేస్తున్నామని నగర మేయర్‌ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో రూ.80 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ మేయర్‌ ముచ్చు లయయాదవ్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. పలుచోట్ల ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. 5,6,11 డివిజన్లలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కింద విడుదలైన నిధులతో రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్‌ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజాల అవసరాలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. ఫలితంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమైందన్నారు. 5, 6 డివిజన్ల కార్పొరేటర్లు గాదం మురళి, ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుపరిపాలన అంటే ఏంటో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తున్నారన్నారు. మరోసారి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా, కోలగట్ల వీరభద్రస్వామి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, ఆయా డివిజన్ల నాయకులు, కార్పొరేషన్‌ సిబ్బంది పాల్గొన్నారు.

లో ఓల్టేజ్‌ సమస్యకు చెక్‌

- సతివాడ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు
- అంతరాయం లేకుండా విద్యుత్‌ సరఫరాకు చర్యలు



సతివాడ సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్‌: వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసకుంటోంది. ఇందులో భాగంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్ల నిర్వహణ, మరమ్మతులపై అధికారులు దృష్టి సారించారు. మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ సరఫరాలో అప్పుడప్పుడు తలెత్తే అంతరాయాన్ని నివారించేందుకు కోటి రూపాయలతో అదనంగా 5 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయనున్నారు. వారం రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు పనులు చురుకుగా జరుగుతున్నాయి. అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుతో సబ్‌స్టేషన్‌ పరిధిలో సుమారు 20 గ్రామాల్లో విద్యుత్‌ కోతలకు చెక్‌ పడనుందని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో మినీ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

విద్యుత్‌ వినియోగం భారీగా పెరగడంతో పలు గ్రామాల్లో లో వోల్టేజ్‌ సమస్య వేధిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్యాడ, ఒమ్మి, అలుగోలు, జోగిరాజుపేట, గుషిణి, బొప్పడాం, వల్లూరు, పారసాం, సారిపల్లి, తదితర గ్రామాల్లో తరచూ విద్యుత్‌ సమస్యలు ఉండేవి. ఒక వీధికి సరఫరా ఉంటే మరో వీధికి విద్యుత్‌ ఉండని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తుప్పుపట్టిన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేసి విద్యుత్‌ సమస్యలకు చెక్‌ పెట్టింది. తాజాగా వల్లూరులో 16 కేవీ, తాళ్లపూడిపేటలో 16 కేవీ, పారసాంలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సారిపల్లి గ్రామానికి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ మంజూరు కాగా మరో వారం రోజుల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

నాణ్యమైన విద్యుత్‌ సరఫరాకు చర్యలు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే సతివాడ సబ్‌స్టేషన్‌లో అదనంగా పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేస్తున్నాం. సబ్‌స్టేషన్‌ నుంచి ఆరు 11 కేవీ ఫీడర్లతో పాటు గుర్ల మండలంలోని ఒక 11 కేవీ ఫీడర్‌కు విద్యుత్‌ సరఫరా అవుతోంది. దీంతో అప్పుడప్పుడు చిన్న చిన్న సమస్యలు ఏర్పడుతున్నాయి. పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుతో వినియోగదారుల ఇబ్బందులు తొలుగుతాయి. అలాగే లో ఓల్టేజ్‌ సమస్య ఉన్న గ్రామాల్లో మినీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడైనా విద్యుత్‌ సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాం.

– పిచ్చయ్య, విద్యుత్‌ ఏఈ, నెల్లిమర్ల మండలం

నిరంతరాయంగా విద్యుత్‌

సతివాడ సబ్‌స్టేషన్‌లో అదనంగా పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయడం మంచిదే. ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుతో విద్యుత్‌ సమస్యలు ఉత్పన్నం కావు. ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌ ఉండడంతో దానిపై లోడు అధికంగా పడి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుతో సుమారు 20 గ్రామాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ అందుతుంది.

–మజ్జి చిన్నంనాయుడు, సతివాడ గ్రామం